International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.7, Issue-7(1), July, 2020
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# తెన్నేటి వారి 'కళ్ళు తెరవండోయ్ నాటిక' మద్యపాన నిషేధం

డా॥ గుదే వివేకానంద స్వామి
తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్
విశాఖపట్నం,
చరవాణి:9866429034

## 1. ఉపోద్ఘాతం:

పశ్చిమగోదావరి జిల్లా రచనాధ్యాయం (స్త్రీ–పురుష రచయితలు) పారిపోషితమై ఎన్నో అవార్డులు, రికార్డులు నెలకొల్పుతూ .... స్వీకరిస్తూ .... బహుకరిస్తూ నూతనత్వాన్ని పొందుతూ ..... సంప్రదాయ పునాదులపై నవ్యకవితా సౌధాలను నిర్మిస్తూ చైతన్యదారుల వెంట పారమార్ధికంగా సాగుతున్నది. వెన్నెల సోనలకు, వాన తుంపరలకు, శిఖరాగ్రాల అంచుల చూపులకు, చిరుపాపల చిరునవ్వులకు, మంచిపాటకు, గొప్పమాటకు, రేకులు విప్పుకునే పూలకు, స్నేహించే మనుషులకు ఎలా స్పందిస్తారో ..... బాలకార్మికుల దుస్థితికి, నేత కార్మికుల పేదరికానికి, రైతుల ఆత్మహత్యలకు, చిరు పాప గుండె జబ్బులకు, మారిపోతున్న మానవతా విలువలకు, స్త్రీ వివక్షతకు, అకాల మృత్యువుకు, రాజకీయ వికృతాలకు, విస్ఫోటకాలకు, ప్రకృతి విలయతాండవాలకి, విపరీత మనస్తత్వాలకు, అనాథ జీవితాలకు, బలవంతపు వ్యభిచార లోగిళ్ళకు, కుళ్ళు కుతంత్రాలకు, కులవ్యత్యాసాలకు, మత మౌఢ్యాలకు, ఛాందస భావాలకు, విదేశీ వ్యామోహాలకు, స్వీయ భావదారిద్ర్యానికి మూడభక్తికి స్పందించాలి. ఇవన్నీ మంచి వైపుకు పరుగెట్టాలని ఆశపడాలి. అప్పుడే కవిని సమాజం గుర్తిస్తుంది. ఇటువంటి లక్షణాలు, ఆశయాలు కలిగిన రచయితగా 'అక్షర కిరీటి' తెన్నేటి లక్ష్మీ నరసింహమూర్తి గారిని పేర్కోవచ్చు. ఈయన చేసిన రచనలు అత్యంత ప్రజాదరణ పొందుతున్నాయి. ఈయన సాహిత్యం పాఠకులను ఆకర్షించింది. కేవలం పశ్చిమగోదావరి జిల్లాలోనే కాకుండా అంధ్రరాష్ట్రంలో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్న తెన్నేటివారు యువ రచయితలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆధునిక సాహిత్య ప్రక్రియ అయిన నాటిక మానవ జీవితంలోని తాత్వికతను, సామాజిక, ఆర్థిక, మానసిక, మాన సంబంధాల్ని విశ్లేషణల్ని, వైఫల్యాల్ని, వైరుధ్యాల్ని ప్రతిబింబిస్తూ శక్తివంత మైన సాధనంగా పాఠకుల్ని కదిలిస్తుంది. అలా ఒక శక్తివంతమైన ప్రక్రియగా అనేక మంది రచయితల చేతిలో అభివృద్ధి చెందుతూ సామాజిక ప్రగతికి తోడ్పడుతుంది. కాబట్టి తెన్నేటివారి నాటికలో దాగి ఉన్న వివిధఅంశాలను పరిశీలించి అధ్యయనం చేయదలిచాను. నేర్చుకునే హృదయం ఉంటే సృష్టిలో ప్రతిదీ ఒక పాఠమే. ప్రతిభావంతులకు ఎల్లలు లేవు. వారి సేవలకు పరిధులు ఉండవు అనటానికి తెన్నేటి మాష్టారి జీవితమే నిదర్శనం. తెలుగు భాషా ఉపాధ్యాయునిగా, కవిగా, రచయితగా, నటుడిగా, దర్శకునిగా, వ్యాఖ్యాతగా, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఇలా పలు రంగాల్లో నిస్వార్థ సేవలందిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి తెన్నేటి లక్ష్మీ నరసింహమూర్తి మాష్టారు.

**కళ్ళు తెరవండోయ్:నేపథ్యం :**

మద్యపానం నుండి పేదలను విముక్తి చేయాలనే కోణంలో వారిని చైతన్యం చేసి ఇప్పుడు కళ్ళు తెరవకపోతే మీ జీవితాలు మూతబడిపోతాయని చెప్పడాన్ని నేపథ్యంగా తీసుకుని ఈ నాటికను తెరకెక్కించారు రచయిత తెన్నేటి నరసింహా మూర్తి. ఈ నాటిక 1993లో ఏప్రిల్ 1వ తేదీనాడు రచించారు.

**కళ్ళు తెరవండోయ్: కథా పరిచయం:**

సీతాలు,సత్తియ్య భార్యా భర్తలు. మేనల్లుడు కోటి. కోటి,సత్తియ్య లు ఏదో సంభాషించుకుంటుంటారు. మద్యం తాగి ఉన్న సత్తియ్య కోటి! కోపం పడకుండా, మావా పదరా ఇంటికిపోదాం అంటూ ఇంటికి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తాడు. తూలి పడిపోతాడు.సత్తియ్యను కోటి ఇంటికి తీసుకురాగానే సత్తియ్య భార్య సీతాలు చూసి తెగ తిడుతుంది.భార్య భర్తల మధ్య మాటల యుద్ధం సాగుతుంది.జుట్టు పట్టుకొంటాడు. సీతాలు అరుస్తూంటుంది.కోటి ఆడకూతురును కొట్టకూడదని విడదీస్తాడు. ఇంతలో రాజు మాష్టారు వచ్చి మళ్ళా గొడవా...సత్తియ్యా నీకెన్నిసార్లు చెప్పాను తాగొద్దని.. మళ్ళా... తాగొచ్చి గొడవ చేస్తున్నావ్.చూడండి సారూ... సీతాలును కొట్టేత్తున్నాడు సత్తియ్య అంటూ కోటి సత్తియ్య తాగుడు గురించి చెప్తాడు.కూడొండటానికి పైసలియ్యట్లేదు. వచ్చిన పైసలన్నీ మాయదారి సారాకొట్టుకేపోస్తున్నాడు తాగొచ్చి గొడ్డును బాదినట్టు బాదేస్తున్నాడు అని సీతాలు ఎక్కి ఎక్కి ఏడుస్తుంటుంది. తాగిన మైకంలో మాష్టారని కూడా చూడకుండా నా ఇష్టం, నాపెళ్ళాన్ని కొడతా...తిడతా...మధ్యలో... నువ్వు ఎవడవయ్యా? అడగటానికొచ్చావ్? మొనగాడివా?అంటూ సీతమ్మను వదిలేసి రాజు మీదకు విసురుగా వస్తాడు.అమాంతంగా సత్తియ్యను పట్టుకొంటూ,ఆగు సత్తియ్య మావా బాబుగార్ని ఏమీ అనమాకు.ఆయనే కదా! మనకుకొద్దిగా అక్షరమ్ముక్కలు నేర్పించేది. మనకు అవసరమైతే డబ్బులు కూడా అప్పు ఇస్తున్నాడు కదా! మన మంచి చెడ్డలు చూసే దేవుడులాంటి బాబుగారి మీదకు వెళ్ళకు అంటూ వారిస్తుంది.

సత్తియ్యకి ఇప్పుడేమీ తెలియదుకానీ, సీతాలుని లోపల మజ్జిగ ఉందా అని అడిగి, ఉంటే ఓ గ్లాసు సత్తియ్యకు పట్టించు మత్తు దిగుతుంది అని చెప్పి,చూడు కోటీ.నీలాటి యువకులంతా ఇలా సారా తాగేసి ఆరోగ్యం పాడుచేసుకుంటున్నారు ఇది మంచి పద్ధతి కాదు...సారాకు ఖర్చుపెట్టే డబ్బుతో మంచి తిండి తిని ఆరోగ్యంగా ఉండొచ్చు కదా! అనేలోగా సత్తియ్య నెమ్మదిగా కళ్ళు తెరచి ఎదురుగా రాజును చూసి కంగారుగా,ఏంటిసారూ! మీరేంటి ఇక్కడికొచ్చారు? ఏమైందే సీతాలు అని ఆశ్చర్యంగా అడుగుతాడు. రాజు మాట్లాడుతూ అది సరేగానీ సత్తియ్య! ఇంతకీ ఎందుకు తాగావు మళ్ళీ తాగొద్దని చెప్పాను కదా! అంటే, చెప్పారు కానీ బాబూ! అలవాటైన ప్రాణం కదా! అందుకనే ఊరుకోలేకపోయా.అందుకనే కొద్దిగా తాగేసాను.కంగారుగా సీతాలను చూసి ఏంటీ నిన్ను కొట్టానా? నన్ను క్షమించవే సీతాలు అని వేడుకుంటాడు.చూడు సత్తియ్య ఈ క్షమించడాలు ఇవన్నీ మామూలే కానీ అసలు మీరు రోజంతా రెక్కలు విరగ్గొట్టుకుంటే వచ్చే సంపాదనలతో సగంపైగా సారాకొట్టుకే పోస్తే నీకు,నీ భార్యాపిల్లకు తిండి ఎక్కడ్నించి వస్తాది? ఇంకొకటి చెప్తాచూడు. సారా వలన నష్టం ఇప్పుడు తెలియదు. నెమ్మది, నెమ్మదిగా మీరు ఇప్పుడు తాగుతున్న సారా మీ ఊపిరితిత్తులను నాశనం చేస్తాయి.మనం బతకటానికి ముఖ్యమైన ఆధారాలు. అవి పాడైపోతే మనం బతకం చనిపోతాం అని చెప్పే సరికి రేయ్ కోటిగా అయితే ఈ వేళ నుండి సారా తాగటం మానేయ్ నేను మానేస్తాన్రా అనుకునే సరికి సీతాలు తెగ ఆనందపడిపోతుంది. సరే అయితే సత్తియ్యా, కోటీ ఇక నుండి తాగటం మానేయండి. వస్తాను. అవతల రాత్రి బడికి టైమయింది వెళ్తాను అని రాజు వచ్చేస్తాడు.

మరుసటి రోజు ఏమేయ్ సీతాలు అలా ఓ మారు బజారుకి వెళ్ళొస్తా. దొరబాబుగారు డబ్బులిస్తానన్నారు. వెళ్ళి పట్టుకొస్తా అని కోటి, సత్తియ్య వెళ్తారు. సీతమ్మలోపల కెళ్తుంది. ఇద్దరూ నడుస్తుండగా సారాకొట్టు వస్తుంది అక్కడే ఆగిపోయి, రేయ్ కోటిగా పేణం జివ్వున లాగేస్తోందిరా ఒక్క గ్లాసు తాగొస్తాన్రా అంటూ మొదలెడతాడు సత్తియ్య.తాగొద్దని నాకు చెప్పి, తాగనని సారు గారికి కూడా చెప్పావు కదా అంటే అదంతా నాకు తెలియదు కానీ ఒక్క గ్లాసు తాగొస్తాన్రా అని ఇప్పుడే వత్తానుండని లోపలికి వెళ్ళి కోటి పిలుస్తున్నా విన్పించుకోకుండా లోపలకెళ్ళి తాగేసి పాటపాడ్తూ జోగుతూ వస్తాడు.

ISSN: 2348-7666; Vol.7, Issue-7(1), July, 2020
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

వీడు ఈ జన్మకి బాగుపడడు. కూడా వచ్చినందుకు నాకు తప్పదు కదా! అనుకొంటూ సత్తియ్యను పట్టుకొని ఇంటికి తీసుకొచ్చి ఇదిగో సీతాలు మళ్ళా తాగొచ్చాడు అని గావుకేకపెద్దాడు.అన్నం పెట్టమని సీతాలను అరుస్తాడు. వండటానికి బియ్యం లేవని చెప్పినా లేచి కొడతాడు. ఇంతలో రాజు వస్తూనే బువ్వ తిను అంటున్నావ్ ఎవర్నిరా కోటి అనేసరికి, ఏం లేదు సారూ.మా మావ మరి మూడ్రోజుల్నుంచి పైసలు లేకుండా అంతా తెగ తాగేసి వస్తున్నాడు. అందుకని కూడు వండలేదు సీతాలు. బియ్యంలేక తిండి లేక బుడ్డోడు ఆకలికి ఏడుస్తున్నాడు.చూసావా సత్తియ్య హాయిగా నువ్వు తాగేసి బానే ఉన్నావ్. కనీసం ఆ పసివాడికి గుప్పెడు తిండి పెట్టు లేకపోతున్నావ్ అని బుద్ది చెప్పే ప్రయత్నం చేస్తాడు.

సీతాలు! ఎప్పుడూ ఇట్లా అంటే ఎలాగా? చూడు సత్తియ్య నువ్వు సంపాదించిన డబ్బులన్నీ సారాకొట్టుకు పోస్తే పెళ్ళాం పిల్లలకు తిండి ఎట్లాపెట్టగలవ్?కూడులేక మూడ్రోజుల్నించి ఆ పసివాడు చూడు ఎట్టా అవుతున్నాడో అంటాడు. అప్పటికే గోపి కళ్ళు తిరిగి పడిపోతుంటే సీతాలు, కోటి పట్టుకొంటారు. చూడరా...చూడు తిండి పెట్టక వాడ్ని మాడ్చేశావ్, పోనీ వాడ్ని చంపేసేయ్.హాయిగా నువ్వు తాగిరావొచ్చు సత్తియ్య చేతులు పట్టుకొని గోపిగాడి మెడమీద ఉంచుతాడు.నే చేయలేను ఆపని బాబుగారు అంటాడు.రాజు కోపంగా ఆ పనిచేయలేవ్...కడుపునిండా తిండి పెట్టలేవ్. పోనీ వాడికి కూడా ఇంత సారాపోయరా.అని మందలించే సరికి నా బాబుకి ఏదో అయిపోయిందని ఏడవబోతాడు.ఆపు నీ దొంగ ఏడుపులు.పిల్లాడు తిండిలేక అలమటించి పోతూంటే నువ్వు కడుపు నిండా తాగొచ్చావు కదా! ఇప్పుడు నీ కళ్ళు చల్లబడ్డాయా? బంగారంలాంటి కొడుకును చంపుకుంటున్నావ్ కదా అని నోటికొచ్చినట్లు తిడతాడు రాజు మాష్టారు.

ఇంతలో సీతాలు బాబూ!...నువ్వే దేవుడివి.ఎలాగైనా నా బిడ్డను కాపాడు బాబూ అంటూ గోపీని తీసుకొని రాజు కాళ్ళమీద పడుతుంది. రాజు బాధ్యతగా భావించి పద సీతాలు గోపిగాడి అదృష్టం ఎట్లాగుందో పద ఆసుపత్రికి తీసుకెళదాం అంటూ సత్తియ్యకేసి తిరిగి, చూడు సత్తియ్య నువ్వు నమ్ముకున్న సారా చూసావా ఎంత పని చేసిందో నీ సంపాదన అంతా సారా కొట్టుకే పోస్తే తిండి ఎక్కడ్నించి తెస్తావ్ తిండిలేక పసివాడు చచ్చే పరిస్థితిలో ఉన్నాడు.ఈసారా తాగటం వలన క్రమంగా నీవాళ్ళు ఇలాగే తిండిలేక ఛస్తారు కొద్ది రోజుల్లో నీగుండెలు కూడా పాడయ్యి నీవు కూడా ఛస్తావ్. ఎందుకురా! అందరినీ చంపేస్తావు నీ వాళ్ళకింత తిండి పెట్టరా.అంటూ వడివడిగా సీతాలు, గోపీని తీసుకొని వెళ్తాడు.కోటికి కూడా సత్తియ్య మీద ఎనలేని కోపం వస్తుంది.ఛీదరింపుతో, ఛీ..ఎదవ జన్మ...కన్నవాళ్ళకు కూడెట్టకుండా సంపాదన అంతా సారాకొట్టుకే పోసేయ్యరా అంటూ, చూడు... గోపిగాడికి ఏమయిందో? ఇప్పటికైనా కళ్ళుతెరవరా. కల్లుతాగటం మానరా. సారా మానరా..అంటూ వెళ్ళి పోతాడు. వాడితో సత్తియ్య కూడా వెళ్తాడు. ఇంతటితో నాటిక ముగుస్తుంది.

**విశ్లేషణ:**

మద్యపానానికి బానిసై భార్యాపిల్లల్ని పట్టించుకోని ఒక పేదవాడు. భార్య అన్నా, కొడుకు గోపి అన్నా చచ్చేంత ప్రేమ ఉన్నా, తాగితే అన్నీ మర్చిపోయి ఇద్దర్నీ చితకబాదే రకం. ఎవరు ఎన్ని రకాలుగా చెప్పినా, ఎవరి మాటా వినడు. తాగనంత సేపూ ఇక జీవితంలో తాగను అని భార్యా బిడ్డలపై ప్రమాణాలు చేస్తాడు. కానీ మాట నిలుపుకోలేడు. ఏ రోజు ఇచ్చిన మాట ఆరోజే వదిలేస్తాడు. మేనల్లుడు, భార్య, అక్షరాలు నేర్పే రాజు ఎందరు చెప్పినా ఆ క్షణంలోనే వింటాడు.

రాజు మాష్టారు అంటే మహాగౌరవం సత్తియ్యకు. రాత్రిపూట వయోజనులందరికీ చదువు చెప్పడం వలన ఆయన మాటకు గౌరవం ఇవ్వాలనుకుంటాడు కానీ అక్కడ కూడా మాట తప్పుతాడు.

కొడుకు గోపి ఒక రోజు స్పృహతప్పి పడిపోయినప్పుడు సత్తియ్య తాగేసే ఉంటాడు. అప్పటికే

మూడు రోజులనుండి అన్నం లేకపోయేసరికి ఆరోగ్యం దెబ్బ తింటుంది. రాజు కలుగజేసుకుని కొడుకుని చంపేయమని కోప్పడతాడు. బుద్ధి తెచ్చుకుని ఆరోజు నుండి మందు మానేస్తాడు.

మద్యపానం చాలా దుర్వ్యసనం. అది అలవాటు చేసుకోకూడదు గాని ఒకసారి చేసుకుంటే మళ్ళీ మానలేం. అదే విషయాన్ని సత్తియ్య పాత్ర ద్వారా తెలియజేశాడు రచయిత.

కోటి సత్తియ్యతోపాటు తిరగడంవల్ల ఇతను కూడా తాగుబోతుగా మారతాడు. ఇద్దరూ కలిసి రోజూ తాగుతూ ఇంటికొచ్చి గొడవ చేస్తుంటారు. అయితే సత్తియ్యలా ఎక్కువగా తాగడు కోటి. తనకు ఒక పరిమితి అంటూ ఉంటుంది. అవసరం నిమిత్తమే తాగుతాడు. అయితే తాగి ఇతరులను రెచ్చగొట్టడం లాంటివి చేయడు. అతిగా తాగొద్దని సత్తియ్యను హెచ్చరిస్తుంటాడు కూడా. సత్తియ్యను తాగుడు నుండి మాన్పించడానికి తాను కూడా మద్యపానాన్ని ముట్టనని ఒట్టుపెట్టుకుంటాడు. కానీ సత్తియ్య మళ్ళీ మాట తప్పేసరికి, కోటి బాధ పడతాడు. ఆడిన మాటల తప్పడం తప్పు అనేది కోటిలో ప్రత్యేకంగా కనిపిస్తుంది. "అదేది మావా.... తాగొద్దని నాకు చెప్పి .... తాగనని ..... సారుగారికి కూడా చెప్పి మళ్ళీ మొదలెట్టావు. ఈడు ఈ జన్మకి మారడు. బాగుపడడు కూడా వచ్చినందుకు బాగా బుద్ధి చెప్పావ్' అంటూ తనలోని బాధను వ్యక్తం చేసిన విధానం పరిశీలిస్తే ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే మంచి లక్షణం కోటితో గుర్తించవచ్చు.

చాలామంది తాగుతారు. కానీ దానికి ఒక పరిమితి అంటూ ఉండేలా చూసుకునేవారు కొందరే ఉంటారు. అలాంటి వాని పాత్రగా కోటి పాత్రను చిత్రించారు. అలాగే ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే మనిషిగా కోటి కనిపించడం మరో విశేషం. ఇటువంటి సందర్భంలో తాగుడు మానేసి మాటకు కట్టుబడి ఉండిపోయాడు. ఈ పాత్ర ఎంతో ఆదర్శంగా చూడవచ్చు. మద్యపానం మానేయడం అంటే చాలా గొప్ప విషయం కనుక.

సారా తాగేవారందరినీ చైతన్యం చేసే పాత్ర రాజు. అక్షర గోదారి పేరుతో రాత్రిపూట చదువుచెప్తుంటాడు. ఈయన చదువు చెప్పడమే కాకుండా సంస్కరణవాదిగా కూడా కనిపిస్తుంటాడు. ఊళ్ళో తాగి తిరుగుతూ భార్యపిల్లల్ని హింసించే వారిని తాగుడునుండి విముక్తి చేసే ప్రయత్నం చేస్తుంటాడు. ప్రజల్లో చైతన్యం తీసుకొస్తూ వారిని అభివృద్ధి పథంలో నడుపుతుంటాడు.

కోటిని తాగుడు మాన్పించి మనిషిలా బ్రతికేలా చేసింది ఈ రాజు మాస్టారే. సత్తియ్య విషయంలో కూడా మద్యపానం నుండి తప్పించడానికి చాలా ప్రయత్నం చేస్తాడు. చివరకి కొడుక్కి జబ్బు చేసిన తరువాత వాడిని అడ్డుపెట్టి మొత్తం మానేసేలా చేయగలుతాడు. తాగితే మనుషులు కారన్న విషయాన్ని రాజు సత్తియ్య తాగిన తరువాత తెలుసుకుంటాడు. 'ఏటి కూశావ్ నాకు బుద్ధి చెప్పే గొప్పోడివా... నువు... నీసంగతి తేల్చేస్తా ...'అన్నమాట రాజుని పెద్దగా ఇబ్బంది పెట్టకపోయినా సత్తియ్య పరిస్థితిని అర్థం చేసుకోగలుగుతాడు. అలాగే తాగుడు వల్ల జరిగే అనర్థాల గురించి వివరించే ప్రయత్నం ఈ పాత్ర ద్వారానే చేయించారు రచయిత. ఎంత చెప్పినా సత్తియ్య మాట వినకపోయేసరికి కొడుకు పరిస్థితిని కళ్ళముందు చూపించి మాన్పిస్తాడు.

ఈ విధంగా ఈ పాత్ర ప్రజల్లో సామాజికంగా చైతన్యం తీసుకు రావడంలో ముందుందని అర్థమవుతుంది. అలాగే ఈ పాత్ర ద్వారా రచయిత ప్రజలకివ్వాలను కున్న సందేశాన్ని సూటిగా ఇవ్వగలిగాడు. ఈ నాటికలో ఈ పాత్రే కీలకంగా చిత్రించబడి సామాజిక చైతన్యాన్ని ఆశించి ప్రయోజనం పొందిన పాత్రగా గుర్తించవచ్చు.

తాగుబోతుల ఇళ్ళల్లో స్త్రీల పరిస్థితి ఎలా ఉంటుందో సీతాలు పాత్ర ద్వారా కళ్ళకుకట్టినట్లు చూపించారు రచయిత. ఈమెను సహనశీలిగా ఈ నాటికలో చిత్రించబడింది. భర్త తాగివస్తే ఎంతో సహనం ప్రదర్శించింది. తాగొచ్చిన భర్తకి స్నానం చేయించి సపరిచర్యలు చేసింది. కొన్ని సందర్భాల్లో భోజనం చేయడానికి డబ్బులు

ఇవ్వనిపక్షాన అప్పు చేసి మరీ కడుపునింపిన రోజులు ఈమె జీవితంలో కనిపిస్తాయి.

తాగొచ్చి కొట్టినప్పుడల్లా మూలన కూర్చుని ఏడవడమేకానీ భర్తకు ఎదురు చెప్పిన దాఖలాలు లేవు. లేకపోతే రాజు మాష్టారిచేత బుద్ధి చెప్పించే ప్రయత్నం చేస్తుంది. 'సూడు దొరా! కూడొండటానికి పైసలియ్యట్లేదు. వచ్చిన పైసలన్నీ మాయదారి సారా కొట్టుకేపోత్తున్నాడు. తాగొచ్చి గొడ్డును బాదినట్టు బాదేత్తున్నాడని తన బాధను చెప్పుకుందేగానీ, ఏనాడూ భర్తకు ఎదురు నిలవలేదు.

భార్యలకుండాల్సిన లక్షణాలను ఈ పాత్రలో ప్రవేశపెట్టారు రచయిత. సహనం, ఓర్పు, దయ, కరుణ అనేవి ప్రతీ స్త్రీకి ఉండాలని చెప్పడంకోసం ఈ సీతాలు పాత్రను సృష్టించినట్లు అనిపించింది.

తాగుబోతుల ఇళ్ళల్లో పిల్లల పరిస్థితి ఎలా ఉంటుందో గోపి పాత్ర ద్వారా చూపించారు రచయిత. సత్తియ్య, సీతాలు దంపతుల ఒక్కగానొక్క కొడుకు గోపి. అభం శుభం తెలియని పిల్లాడిగా ఈ పాత్రచిత్రణ చేశారు రచయిత. కారణం తండ్రి తాగుబోతు అయినప్పుడు, తల్లి సంసారాన్ని ఈదలేనప్పుడు పిల్లల పరిస్థితి ఎట్లా ఉంటుందో ఈ పాత్రద్వారా చిత్రించారు రచయిత.

తండ్రి తాగొచ్చి గొడవ చేస్తున్నప్పుడు, అతను ఎందుకు అలా చేస్తున్నాడో అర్థంకాక అమాయికంగా ఉండిపోయే తత్వం గోపిది. అంత గొడవలోనూ కూడా 'అమ్మా ఆకలేస్తుంది కూడెట్టమంటే కూడెట్టలేదురా' అని వ్యక్తం చేయడంలో ఆ పిల్లాడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. తల్లిదండ్రులుసక్రమంగా లేకపోతే పిల్లల పరిస్థితి గోపి పాత్రలాగే ఉంటుందని పరోక్షంగా సమాజంలోని తల్లిదండ్రులందరికీ సందేశమిచ్చినట్లు అర్థమవుతుంది.

కళ్ళు ఎందుకు తెరవాలి? ఏ విషయంలో తెరవాలనే దాని గురించి ఆలోచిస్తే, నిజానికి భౌతికంగా కళ్ళు తెరవమనికాదు. బ్రతుకును సక్రమంగా లాక్కెళ్ళాలంటే మానసికంగా ఆలోచించండి అనే ఉద్దేశ్యంతో చెప్పినది. సత్తియ్య అస్తమాటు తాగేస్తూ ఇంటికొచ్చి భార్యను కొట్టడం, కొడుకు, కూతుళ్ళను మద్యం కోసం హింసించడం చేస్తుంటాడు. కూతురికి ఆరోగ్యం బాగాలేనప్పుడు కనీసం చేతిలో ఒక్క పైసా కూడాలేని సందర్భంలో సత్తియ్య అయోమయంలో పడి ఏం చేయాలో తెలీక, తాను మద్యంనకు బానిస అవడం వల్లే ఇవన్నీ అని తెలుసుకుని రాజు మాష్టారి సలహాతో మద్యం మానేస్తాడు. ఈ రాజు మాష్టారే అందర్నీ కళ్ళు తెరవమని చెప్పడం వెనుక సారాను మానేయమని చెప్పడమే కాబట్టి ఈ పేరు సముచితంగా అనిపించింది.

ఈ విధంగా ఈ తెన్నేటి 'కళ్ళు తెరవండోయ్' నాటిక పూర్తిగా అధ్యయనం చేశాక సామాజికకోణంలోనే ఈ నాటిక రాయబడిందని అర్థమైంది. అలాగే ఈ నాటిక ద్వారా సమాజానికి ఇవ్వాలనుకున్న సందేశం సూటిగా పాఠకులను చేరేదిగా ఉందనిపించింది.

**ఉపయుక్త గ్రంథసూచిక :**

1. ఏకాంకిక నాటికలు - దివాకర్ల వేంకటావధాని, సంస్కృతి, 1955.
2. చింతా దీక్షితులు నాటికలు-పరిశీలన, గేదెల వలసయ్య,వాల్తేరు,1985.
3. తెన్నేటి నాటికలు -1: తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి, 2014
4. తెలుగు ఏకాంకిక - శ్రీపాద కృష్ణమూర్తి, భారతి, 1949.
5. తెలుగు ఏకాంకికలు - సామాజిక స్పృహ - ఎస్. గంగప్ప, భారతి, 1977.
6. తెలుగుఏకాంకిక- పుట్టుపూర్వోత్తరాలు, పోరివిజయరాఘవరెడ్డి, నాట్యకళ, 1980.

-0-0-0-